క్లుప్తంగా

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



సదస్సులో మాట్లాడుతున్న జేసీ ఇలాక్కియా

గండేపల్లి: సమస్యలుంటే తెలియజేయాలని కాకినాడ జిల్లా జేసీ (జాయింట్ కలెక్టర్) ఎస్.ఇలక్కియ అన్నారు. మండలంలోని నీలాద్రిరావుపేట, జెడ్ రాగంపేట పరిధిలో మైనింగ్ (సుద్ద) లీజుకు సంబంధించి సచివాలయం-2లో మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో ఆమె పాల్గొన్నారు. సుద్ద తవ్వకాలు, తరలింపులకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లగా నమోదు చేసుకుని నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. పొల్యూషన్ కంట్రోల్ ఈఈ ఎన్.అశోక్, తహసీల్దార్ చిన్నారావు, వీఆర్వో దిలీప్, గ్రామస్తులు ఉన్నారు.

చెరువులోకి దూసుకుపోయిన కారు

గండేపల్లి: జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకుపోయింది. డ్రైవర్‌కి త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. విశాఖపట్నం వైపు నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న కారు బొర్రంపాలెం సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న సిమెంట్ పోల్స్‌ను ఢీకొని పక్కన ఉన్న చెరువులోకి దూసుకుపోయింది. రోడ్డు సేఫ్టీ సిబ్బంది, స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీశారు.

పీహెచ్‌సీ భవనానికి నేడు శంకుస్థాపన

గండేపల్లి: సూరంపాలెంలో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నాయకులు, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్లు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీత తదితరులు హాజరవుతారన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

తుని: అమరావతి జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మున్సిపల్ ఉద్యోగులు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెల్‌ఫోన్ వినియోగించకుండా విధులు నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులకు సంబంధించిన సమస్యల సాధన కోసం రెండో విడత కార్యాచరణ ఈ నెల 29 వరకూ నిర్వహిస్తున్నామని ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

గోకవరం: గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరుకొండ సీఐ ఉమామహేశ్వరావు విజ్ఞప్తి చేశారు. గోకవరం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎస్సై శివ నాగబాబు ఆధ్వర్యంలో గ్రామపెద్దలతో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, పాలూరి బోసుబాబు, కులపర్తి బుజ్జి, గునిపె భరత్, ఈది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ఏలేశ్వరం: నవధాన్యాల సాగుతో భూసారం పెంపొందుతుందని ప్రకృతి వ్యవసాయ మేనేజర్ జె.ఎలియరాజ్ అన్నారు. రమణయ్యపేటలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి, ఎంపీఈఓ దివ్య, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు, సర్పంచ్ ములగపాటి రఘురామకృష్ణ, పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ మాసోత్సవాలు ప్రారంభం

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పండితులు కలశ స్థాపన, మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించి, పూజలు చేశారు. అనంతరం లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ మాసోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకూ జరగనున్నాయి. కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా బుధవారం అమ్మవారికి చండీహోమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

పది లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ కేసుల్లో పరారీలో ఉన్న కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, ఏలేశ్వరం మండలం సిరిపురం, ప్రత్తిపాడు మండలం వేములపాలెం గ్రామాలకు చెందిన కక్కల గోవిందు, టేకుమూడి దుర్గాప్రసాద్, దిడ్డి వీరబాబులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇంటింటా జగనన్నే మా భవిష్యత్తు

- గడప గడపకూ గృహసారథులు
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరిస్తున్న ప్రజాప్రతినిధులు



తునిలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఏలూరి బాలు

ఏలేశ్వరం: తుని, ప్రత్తిపాడు నియోజక వర్గాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. గృహసారథులు, సచివాల య కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని వివరించారు. అభివృద్ధిపై అభిప్రాయ సేకరణ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదో రోజు మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, సచివాలయాల పట్టణ కన్వీనర్ అలమండ వీరరాఘవస్వామి ఆధ్వర్యంలో స్థానిక 13 వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, పథకాలను వివరించారు. స్థానిక 18వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ యండగండి నాగబాబు ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం, ఉత్తరకంచి, శరభవం, గజ్జనపూడి, చింతలూరు, పోతులూరు, వాకపల్లి, ఇ.గోకవరం, వేములపాలెం, యాజే పురం తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

తునిమండలంలో..

తుని రూరల్: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుంది. మంగళవారం చామవరంలో తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా, పథకాలు కొనసాగించాలా, వద్దా అంటు సర్వే నిర్వహించారు. గృహస్తుల అనుమతితో తలుపులపై స్టిక్కర్లు అతికించారు. తేటగుంట, కొత్త సూరవరం, ఎస్.అన్నవరం, కేఓ.మల్లవరం, తాళ్లూరు, లోవకొత్తూరు, తదితర గ్రామాల్లో కార్యక్రమాలు జరిగాయి. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్ అత్తి నాగరాజు, ఉపసర్పంచ్ పోతుల పెదకాపు, నాయకులు గణేషుల వీరబాబు, చక్రరావు, దొరబాబు పాల్గొన్నారు.

అన్నవరం: గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలిసికట్టుగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. గ్రామ సర్పంచ్ ఎస్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ కొండి లక్ష్మి, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, పలివెల సతీష్, సుబ్బాజీ, వీరబాబు, వార్డు సభ్యులు శ్రీనివాస్, అన్నారం, ఆనంద్, చిన్నా, గౌరీశంకర్, సూరిబాబు, బుజ్జి. రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు విజ్ఞప్తి చేశారు. మంగళవారం టీజే నగరంలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ సుర్ల రాంబాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించి సీఎం జగన్ పాలనపై అభిప్రాయాన్ని కోరారు. కాకరాపల్లిలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటనందూరులో సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి, కేఓ అగ్రహారంలో కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, సీతారామరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

తొండంగి మండలంలో...

తొండంగి: మండలంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎ.కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు సాపిశెట్టి భూలక్ష్మి, పార్టీ నాయకులు సాపిశెట్టి చిన్నా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటా పర్యటించారు. సీతారాంపురంలో ఎంపీటీసీ పెండ్యాల రామకృష్ణ, సర్పంచ్ పెండ్యాల సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రావికంపాడులో పార్టీ గ్రామ కన్వీనర్ మేడిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం జరిగింది. 1250 ఇళ్లకు గడపగడపకు తిరిగి జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందని పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి, వైస్.ఎంపీపీ నాగం గంగబాబు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలన్నారు. కృష్ణాపురం, పైడికొండ, గోపాలపట్నం, బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం తదితర గ్రామాల్లో కూడా కొనసాగింది.



రావికంపాడులో పార్టీ నాయకులు

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

తుని: రాష్ట్రంలో సంక్షేమ రథాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరో మారు ఆశీర్వదించాలని నియోజకవర్గ యువత అధ్యక్షుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు కోరారు. మంగళవారం స్థానిక 21వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనపై ఆరా తీసారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పాతబజారు వీధి వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ మార్నీడు శ్రీను, కలం దివాణం తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చింతలూరు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చామవరంలో మాజీ చైర్మన్ నాగం దొరబాబు, సచివాలయ కన్వీనర్, గృహ సారధులు



అన్నవరంలో స్టిక్కర్‌ను అతికిస్తున్న సర్పంచ్ కుమార్‌రాజా, ఇతర నాయకులు

విద్యతోపాటు క్రీడలూ అవసరం



ట్రోఫీతో విజేతల జట్టు

గండేపల్లి: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లో జరుగుతున్న ఆదిత్య చాంపియన్ ట్రోఫీ-2023 క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల దేహదారుఢ్యం, క్రమ శిక్షణ, పోటీతత్వం పెంపొందుతాయన్నారు. 82 జట్లు పోటీల్లో పాల్గొనగా ఆదిత్యా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు విన్నర్‌గా నిలిచి ట్రోఫీ, రూ.12 వేల నగదును గెలుచుకున్నారని పీడీ మురళీమోహన్ తెలిపారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచి ట్రోఫీ, రూ.8వేలను బహుమతిగా పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ రమేష్ ఆదిరెడ్డి, డీన్ జేడీ వెంకటేష్, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

కోటనందూరు: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని సమగ్రశిక్ష బాలికా అభివృద్ధి అధికారి(జీసీడీఓ) పి.ఉమామహేశ్వరి సూచించారు. మంగళవారం అల్లిపూడి కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాల రికార్డులు, పరిసరాలు పరిశీలించిన ఆమె పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. పరీక్షల సన్నద్ధంపై ఆరా తీశారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థినులకు మంచి విద్యనందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కోటనందూరు హైస్కూలును సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆడపిల్లలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించి ఎంఈఓ శ్రీనివాస్‌తో పలు అంశాలపై చర్చించారు. కేజీబీవీ ఎస్‌ఓ ఆర్ రాజేశ్వరి, హెచ్‌ఎం పీవీవీ సత్యనారాయణ, సీఆర్పీ బాబ్జీ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఎన్టీ రాజాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం

గండేపల్లి: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. ఎన్టీ రాజాపురం గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జెడ్పీటీసీ పరిమి మంగతాయారుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కందుల చిట్టిబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, గండేపల్లి ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, తదితరులతో కలిసి ఎమ్మెల్యే జ్యోతుల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు, లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్య అయినా తక్షణమే తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాలు భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చెందుతాయని, అందుకు ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కేతిన బాబి, వైఎస్ ఎంపీపీ కుంచే రాజా, సచివాలయల మండల కన్వీనర్ తాళ్లూరి మధు, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్, సానేపిని చౌదరి, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, సచివాలయ గ్రామ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి, పార్టీ నాయకులు పోశ్ని బాబురావు, జ్యోతుల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీ రాజాపురంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగనన్నే మా భవిష్యత్తు

గ్రామంలోని జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతి మెట్టును తట్టి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు వారి అనుమతితో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



శంఖవరంలో ప్రభుత్వ పథకాలు తెలుపుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

శంఖవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక సచివాయం-2లో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్ర లచ్చబాబు, పడాల బుజ్జి, పడాల సతీష్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి

- అధికారులకు ఎంపీపీ బుజ్జి ఆదేశం
- మండల సర్వసభ్య సమావేశం

ఏలేశ్వరం: సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారించాలన్నారు. ప్రస్తుతం వేసవిలో తాగునీటి సమస్య ఆర్‌డబ్ల్యూఎస్ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు చూడాలన్నారు. తొలుత ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ మాట్లాడుతూ గత సమావేశాల్లో అభివృద్ధి నిధులపై ఎటువంటి తీర్మానాలు చేపట్టకపోవడంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల అనుమతితో నిధులు కేటాయించాలన్నారు. ఎంపీటీసీలందరికీ సమానంగా నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరో ఎంపీటీసీ సభ్యురాలు కాలారి శిరీషా మాట్లాడుతూ మహిళా ఎంపీటీసీలకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక గది కేటాయించాలన్నారు. లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు మాట్లాడుతూ జలసిరి పథకం పంచాయతీలకు అందించేలా మండల తీర్మానం చేయాలన్నారు. వీటిపై ఎంపీపీ సానుకూలంగా స్పందించారు. అనంతరం మండలస్థాయి అధికారులు తమ శాఖల అభివృద్ధిపై వివరించారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, వైస్‌ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

విద్యా కానుకపై సమీక్ష

కిర్లంపూడి: కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకపై ఉపాధ్యాయులు, సీఆర్పీలతో జిల్లా విద్యాశాఖ అధికారి అన్నపూర్ణాదేవి మంగళవారం రివ్యూ నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి విద్యార్థులకు అందజేసే జగనన్న విద్యా కానుక కిట్లను ఏ విధంగా సేకరించాలి, ఎలా పంపిణీ చేయాలి అనే దానిపై సూచనలు, సలహాలు ఇచ్చారు. తొలిత పాఠశాలలో జీవీకే స్టాక్ పాయింట్ భద్రత ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. సీఎంఓ చామంతి, ఎంఈఓ టి.జోషఫ్, హెచ్‌ఎం ఆకుల శ్రీనివాసరావు, ఏపీఎం వినకోటి శ్రీను, సీర్పీలు ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డీఈఓ అన్నపూర్ణ అన్నారు. ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సీఎంఓ చామంతి నాగేశ్వరరావుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల స్టోర్ రూంను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కిర్లంపూడి హైస్కూల్‌ను పరిశీలిస్తున్న డీఈఓ అన్నపూర్ణాదేవి

గండేపల్లి: నాలుగో విడత జగనన్న విద్యాకానుకను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మల్లేపల్లి స్టాక్ పాయింట్ జెడ్పీ స్కూల్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈయన వెంట ఎంఈఓ కెహెచ్ నాయక్, ఏపీఎం సన్యాసిరావు, హెచ్‌ఎం సుధా మాధురి, సమగ్ర శిక్ష మండల పరిధి సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



ఏలేశ్వరంలో జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



ప్రత్తిపాడులో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ నాయకులు

ఏలేశ్వరం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక కోనేటిబడి వద్ద పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే సేవలు అపూర్వమన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొదిరెడ్డి గోపి, సుంకర రాంబాబు, అలమండ వీరరాఘవస్వామి, తొండారపు రాంబాబు, దాకమర్రి లోవరాజు, అలమండ దుర్గా వెంకటప్రసాద్, బోద చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పూలే చిత్రపటానికి డిపో మేనేజర్ వి.సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేటలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిప్రసాద్, ఎంపీ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఇజ్జిన మల్లి, జె.కొత్తూరులో మండల తహసీల్దార్ శ్రీదేవి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రత్తిపాడు: మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలు మంగళవారం జరిగాయి. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటర్ వద్ద మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహానికి సంఘం నియోజవర్గ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ మదినే సూకరాజు పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. సంఘ నాయకులు కొయ్యా శ్రీనుబాబు, ధరణాలకోట తాతబ్బాయి, విశ్రాంత ఏఎస్సై ఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ధరణాకోట శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటి నాయకులు దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బార్ ఆధ్వర్యంలో జరిగిన పూలే జయంతి వేడుకలో న్యాయవాదులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ, ప్రధాన కార్యదర్శి రాజాల చిట్టిబాబు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు బండారు నరసింహారావు, కలవలపల్లి సుజన, లింగంపల్లి శివకుమార్, దాడి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, టీడీపీ కార్యాలయం, బీసీ సంక్షేమ సంఘం కార్యాలయాల్లో పూలేకు నివాళులర్పించారు.

జగ్గంపేట: ఇర్రిపాకలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. పూలచిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ

కిర్లంపూడి: గత ప్రభుత్వం హయంలో జరిగిన అవకతవకలపై డీఎల్పీఓ ఎం.బాలమణి మంగళవారం విచారణ చేపట్టారు. రాజుపాలెం గ్రామ పంచాయతీలో కోట్ల రూపాయాలు నిధులు దుర్వినియోగం జరిగినట్టు వైఎస్సార్ సీపీ నాయకులు గణేశుల రాంబాబు, గణేశుల లచ్చబాబు, పలువురు పాలక వర్గ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపట్టాలంటూ అనేక సార్లు ఆందోళనలు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా డీఎల్పీఓ ఎం.బాలమణి మాట్లాడుతూ 2014-15 సంవత్సరంలో రాజుపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ రూ.33,88,311 నిధులు దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై హైకోర్టు, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు విచారణ చేపట్టేందుకు వచ్చారు. ఇంజినీరింగ్ అధికారులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో పరిశీలన జరగలేదని, నెల లోపు విచారణ చేపట్టి సమగ్ర నివేదికను కలెక్టర్‌కి సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శులు ఉన్నారు.

అవినీతి సొమ్మును రికవరీ చేయాలి : మాజీ సర్పంచ్ హయంలో కోట్ల రూపాయాలలో జరిగిన అవినీతి పనులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలంటూ వైఎస్సార్ సీపీ నాయకులు గణేశుల లచ్చబాబు, గత పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. గ్రామంలో రోడ్లు, అభివృద్ధి పనులపై కోట్ల రూపాయాలు అవినీతి జరిగిందని, ఆ అవినీతి సొమ్మును రికవరీ చేయాలన్నారు.

వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలి

ఏలేశ్వరం: వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి మరింత విస్తరింపజేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ డిమాండ్ చేసింది. భద్రవరం గ్రామంలో మంగళవారం లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ కార్మిక కుటుంబాలకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ హయాంలో ఉపాధిహామీ పథకానికి తూట్లు పొడిచారన్నారు. దేశంలో 30 కోట్ల మంది కూలీలను పనుల నుంచి తొలగించారన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదలకు నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. దీనికి నిరసనగా ఈనెల 17న విజయవాడలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. వీరబాబు, రాజులమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి మాతృ వందనయోజన (పీఎంవీవై) కార్యక్రమంలో 150 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 77 మందికి స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణులకు భోజనాలు పంపిణీ చేశారు.

వర్మీ కంపోస్టుపై అవగాహన పెంచాలి

కోటనందూరు: వర్మీ కంపోస్టు ఎరువుతో కలిగే ప్రయోజనాలపై రైతుల్లో అవగాహన పెంచాలని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ సూచించారు. మంగళవారం టీజే నగరంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని తనిఖీ చేసారు. వర్మీకంపోస్టు తయారీ, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు కుశిరెడ్డి అప్పలరాజు, రావాడ రామచంద్రకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.